# ఉడుకు రక్తం

## సోమిరెడ్డి జమున

"అదేమిట్రా కృష్ణయ్యా అర్చనమ్మ గృహ ప్రవేశం ఈరోజే అనుకుంటాను ఇంకా తయారు కాలేదేమిట్రా? ఏమమ్మా కామాక్షీ నువ్వెళ్ళవా?

నేనెళ్తున్నాను నాన్నా! నీ మనవడు రాడంట ఆమె మాటల్లో ఎంత నిష్ఠూరం వుందో అంత బాధ అంతర్గతంగా లీనమయ్యింది

ఏమిటీ మోహన్‌కృష్ణ వెళ్ళడా అదేవిటీ?

వాడిని నువ్వే అడుగు ఎందుకెళ్ళడో! విసురుగా అనేసి తాతా మనవడిని అక్కడ ఒంటరిగా వదిలి లోపలికెళ్ళింది కామాక్షి.

ఏమిట్రా మోహనా! నిన్న మొన్నటి దాకా గృహ ప్రవేశానికి ఎలా చెయ్యాలా అని నన్ను ఊదర గొట్టేవి పైగా దగ్గరుండి చెల్లెలికి ఇల్లు కట్టిస్తేవే ఇప్పుడేమొచ్చిందిరా అలక

అలకేమీ లేదు వూర్కే వెళ్ళడంలేదు

ఒరే! ఇలాంటి కబుర్లు అదిగో గోచి పెట్టుకుని గోలీకాయలాడుతున్నాడే వాడికి చెప్పు మూడు తరాల అనుభవాలతో నా తల పండిపోయింది ఏమయిందో నిజం చెప్పరా

నిజం చెప్పడానికేముందిందులో! జానకిరామ్‌ని గృహప్రవేశానికి పిల్చుకున్నారు వాళ్ళు నేనెందుకెళ్తానింక?

ఏ జానకిరామ్‌రా కృష్ణయ్యా? అయినా వాడెవడో తలకు మాసినోణ్ణి పిల్చుకుంటే నువ్వెళ్ళకపోవడమేమిట్రా ఎచ్చి సన్నాసీ!

తలకి మాసినో డెందుకవుతాడులే! అయిన వాడయితేనేగా పిల్చుకున్నారు

బోళ్ళున నవ్వాడు కోదండరామయ్య ఆయన నోట్లో లెక్క పెడ్తే నాలుగు పళ్ళున్నాయి

అయిన వాళ్ళనుగాక పరాయి వాళ్ళను పిల్చుకుంటారురా గృహ ప్రవేశానికి

అందుకే నేనెళ్ళడం లేదు

ఆయనకేమీ అర్థం కావడం లేదు మంచం మీద నుండి లేవబోయి లేచే ఓపిక లేక కూతుర్ని కేకేసాడు

అమ్మాయీ! ఇలా రా! ఏమిటంటాడు వీడు?

వాకిట్లో వెనకే కాచుకు కూర్చున్నట్టు క్షణంలో దగ్గరకొచ్చిందామె తన కన్న కొడుకు తను పెంచిన శరీరం తను నేర్పిన బుద్ధులు అయినా ఎదిగిన కొడుకు సంపాయిస్తున్న కొడుకు ఆ కొడుక్కి నచ్చ చెప్పుకోలేని బలహీనత ఆమె కళ్ళల్లో నీరు నింపుతోంది ఆ నీళ్ళల్లో కేవలం ఆగ్రహాన్ని కరిగించుకుంటోంది

ఆ జానకిరామ్ లేడూ కాలేజీలో అల్లుడికి వీడికీ స్నేహితుడు అప్పుడేదో ఎలక్షన్లలో పేచీ రాలా ఆ పిల్లాడ్ని అల్లుడు గృహప్రవేశానికి పిల్చాడట

ఆఁ పిలిస్తే వీడికేమంట?

నాకేమా? విసురుగా లేచాడు మోహన్‌కృష్ణ

ఆ రోజు ఎవరి కొరకు నేను తల బద్దలు కొట్టించుకుంది? అప్పుడేమన్నా వీడు నా చెల్లెలికి మొగుడా? స్నేహితుడని వీడి వైపు మాట్లాడినందుకే కదా ఆ జానకిరామ్‌కి నేను పగయ్యాను ఒక్క మాట ఒక్క మాట కూడా నాతో అనకుండా గృహ ప్రవేశానికి పిలుస్తాడా?

ఏదో లేరా నువ్వింత బాధ పడ్తావని అనుకోనుండడు రేవంత్! చిన్నోడవ కదా!'

అదీ కాదు నాన్నా! గృహప్రవేశమన్నాక బంధువులనంతా పిల్చుకోవాలా అక్కరలేదా? రేవంత్ పెదనాన్న చిన్న కూతుర్ని ఆ జానకిరామ్ కిస్తే పిలవకుండా ఎలా వుంటాడు? తండ్రితో అంది కామాక్షి

పిల్చుకోమను ఎవరొద్దంటున్నారు నేను పోనంటున్నానంతే మోహన్‌కృష్ణ రోషంగా అన్నాడు

అదేమిటిరా నాన్నా! పోనంటే ఎట్టారా? రేప్రొద్దున నీ పెళ్ళికి నీ చెల్లెల్ని పంపిస్తారా?

తాత వైపు చిత్రంగా చూసాడు మోహన్‌కృష్ణ

నా పెళ్ళికి నా చెల్లెల్ని పంపించరా

బాగుందిరోయ్ మనవడా! నీ చెల్లెలింటికి నువ్వు పోనప్పుడు నీ పెళ్ళికి నీ చెల్లెలెందుకు వస్తుందిరా కళ్ళజోడు సవరించుకుంటూ అన్నాడు కోదండరామయ్య

నేను నా పెళ్ళికి నా చెల్లెలికిగానీ నా బావగ్గానీ పగయిన వాళ్ళను పిల్చినప్పుడు వాళ్ళను రావద్దను అంతేగానీ ఉక్రోష పడుతున్న మనవణ్ణి సరదాగా చూస్తున్నాడు తాత అతని జీవితంలో ఇలాంటి ఆవేశాలు సర్దుబాట్లు ఎన్నో ఇంకెన్ని పాఠాలో అతని జీవితంలో

కృష్ణయ్యా! ఇప్పుడు నువ్వు నీ బావ గృహప్రవేశానికి వెళ్ళలేదనుకో అప్పటి నుంచి వాళ్ళకి పగవాడివే కదా! పగవాడి పెళ్ళికి ఎందుకొస్తారు!

నేల మీద కూలబడి తలెత్తి కొడుకు మారతాడని ఆశగా చూస్తోంది కామాక్షి గృహ ప్రవేశానికి పోనంత మాత్రాన నేను చెల్లెలికి అన్నను కానా? ఆశ్చర్యంగా అడుగుతున్న పాతికేళ్ళ మనవడి వంక ఆశ్చర్యంగా చూసాడు కోదండరామయ్య

నీ చెల్లెల్ని నీ స్నేహితుడికిచ్చినప్పుడే నీ చెల్లెలు పరాయిదయిపోయిందిరా కేవలం మీ ఇద్దరి మధ్య వుండేది బంధుత్వం అంతే అతను ఒప్పుకుంటేనే నీ చెల్లెలు ఏమయినా చెయ్యగలదు మీ ఇద్దరి మధ్య వున్న ఆ కాస్త బంధుత్వాన్ని ఈ రోజు నువ్వు తెంపేసుకోవాలని చూస్తున్నావు

కాస్త బంధుత్వం ఏమిటి నాన్నా వీడికెంత ప్రేమని అదంటే! నెల క్రితమే నేను వద్దన్నా వినకుండా రెండు వేలు పెట్టి అదేంటో అప్పటికప్పుడు ఫోటోలొచ్చే కెమెరా తెచ్చి ఇంట్లో పెట్టాడు ఈ రోజివ్వడానికి '

ఇప్పుడేమయిందమ్మా నువ్విచ్చిరా కాదన్నానా అన్నాడు మోహన్‌కృష్ణ అతనిక్కూడా చెల్లెలు బావ మరోసారి పీటల మీద కూర్చుంటే చూడాలనీ ఆ దృశ్యాలను కెమెరాలో నుండి అప్పటికప్పుడు తీసి అందరికీ చూపించాలని నలుగురు ముందు చెల్లెలు గర్వించేలా ఆ కెమెరా ఇవ్వాలని మనసులో వుంది కానీ ఆ జానకిరామ్‌ని ఎందుకు పిలవాలి? అదెంత అవమానం తనకు తన మనవడి ద్వారా వాళ్ళ మధ్య ఏర్పడిన కక్షలు గుర్తొచ్చాయి కోదండరామయ్యకు ఆ సంఘటనలోకి నాలుగేళ్ళ వెనక్కెళ్ళాడాయన

మోహన్‌కృష్ణ జానకిరామ్ రేవంత్ బి కాం లో స్నేహితులు వాళ్ళు ఆఖరి సంవత్సరం చదువుతుండగా కాలేజీ ఎలక్షన్లలో రేవంత్‌కి పోటీగా జానకిరామ్ చెల్లెలు నిల్చుంది రేవంత్‌ని డ్రాప్ చేసుకోమని కోరాడు జానకిరామ్ అందుకు అంగీకరించలేదు రేవంత్ దాంతో వాళ్ళిద్దరి మధ్య తగువు చిలికి చిలికి గాలి వానగా తయారయింది వాళ్ళిద్దరి పట్టుదలలను సర్దాలని ప్రయత్నించాడు మోహన్‌కృష్ణ కానీ జానకిరామ్ దురుసుతనంతో మోహన్‌లో కూడా విరక్తి కలిగింది ఫలితంగా స్నేహితుల్లో చీలికలేర్పడ్డాయి రేవంత్ జానకిరామ్‌ల ప్రమేయం లేకుండా వాళ్ళ సహచరులు కక్షలను తారాస్థాయికి చేరుస్తూ పోలింగ్ రోజు మోహన్‌కృష్ణ రక్తం కాలేజీ గోడమీద ఎర్రటి పెయింటింగ్ అయింది

ఆ సంఘటనతో మోహన్‌కృష్ణకు జానకిరామ్ దూరమయిపోయాడు అప్పటి నుండి ఇప్పటి వరకు కాలం తెచ్చే మార్పులకు కూడా మోహన్‌కృష్ణ మనస్సు మారలేదు తన చెల్లెల్ని రేవంత్‌కిచ్చి పెళ్ళి చేసాడు ఆ వివాహం జరిగిన సంవత్సరానికి అతనికి పెద నాన్న కూతుర్ని జానకిరామ్ చేసుకున్నాడు ఆ బంధుత్వం జానకిరామ్ రేవంత్‌లని కలిపింది ఎవరి కోసం తను దెబ్బలు తిన్నాడు? రేవంత్ సర్వం మర్చిపోయి జానకిరామ్‌ని గృహప్రవేశానికి

అవ్వానిస్తా_డా? అనే ఉక్రోషంతో వున్న తన మనవడిని శాంత పర్చే వుద్దేశంతో అన్నాడు కోదండరామయ్య

ఒరే కృష్ణయ్యా! నీ చెల్లెలు నీవెళ్తే సంతో షిస్తుంది కానీ కెమెరా పెట్టి చూసి సంతోష పడు_ందర్రా

అయినా ఎందుకులే నాన్నా అదుంటే ఇంట్లో వుండదా! అల్లుడికి గుడ్డలు అర్చనకు పట్టు చీర వుండనే వున్నాయి

అలా అంటున్న తల్లితో అన్నాడు మోహన్‌కృష్ణ

ఆ కెమెరా అర్చనకని కొన్నాను దానికే ఇవ్వు మనింట్లో ఎందుకు?

పకపక నవ్వాడు కోదండరామయ్య

ఒరే నాన్నా! వెళ్ళు వెళ్ళి నీ చేతులగుండా ఇచ్చిరా ఎచ్చి ఎల్లా నీ కొరకు ఎదురు చూస్తూ వుంటుంది ఇదిగో ఇలాటి పట్టింపులతో నా తల మెరిసిపోయింది అయిన వాళ్ళందర్నీ పోగొట్టుకుని ఈ రోజు అనుకుంటుంటాను అందరం బ్రతికున్న ఆ రోజుల్లో పట్టుదలలకు పోయి ఎంత కాలాన్ని ఎంత ఆనందాన్ని ఎంత మనశ్శాంతిని వృధా చేసుకున్నానో! అని ఆ వృద్ధుడు నిట్టూర్చాడు

ఊహఁ ఈ రోజెళ్ళను రేపెళ్తాలే

రేపెళ్తాడట రేపెళ్తాడు రేపెళ్ళి ఆ పిల్లను ఉద్ధరిస్తా_డు ఈ రోజు నలుగుర్లో ఆ పిల్లకెంత చిన్నతనం కోపంగా లేచి నిట్టూర్చింది కామాక్షి.

అమ్మాయి చెప్పింది నిజమేరా నీ ప్రేమ నీ చెల్లెలికి తెలుస్తుంది నలుగురికీ ఎలా తెలుస్తుంది? మీ అమ్మ కడుపున పుట్టిన ఆ ఇద్దరు నలుసుల్లోనే తగాదాలొచ్చాయని కథలల్లుతారు బంధువులు

అల్లుకోనీ

ఉడుకు రక్తం! మనసులో అనుకున్నాడాయన

నా మాటినరా కృష్ణయ్యా! ఈసారి వెళ్ళు మరోసారి ఆ జానకి రాముణ్ణి ఏ కార్యానికి ఎలవకుండా నేను చూస్తా_ను

ఏమక్కరలేదు ఎవరికిష్టమైన వాళ్ళని వాళ్ళు ఎల్చుకుంటారు నేనెళ్ళకపోతే వాడికేమీ మునిగిపోదు

తాత మనవడి కళ్ళల్లోకి చూసాడు ఆ కళ్ళ నిండా పట్టుదలతో పాటు బాధా మిళితమయింది.

బావగారు కట్టే యింటిని తన స్వంత ఇల్లులా భావించి ఎన్ని సలహాలిచ్చాడు కృష్ణుడు. రేవంత్‌కి అర్ధాంతరంగా ట్రాన్స్‌ఫర్ వస్తే నెల రోజులు జీతం నష్టం మీద శెలవు పెట్టి ఆ ఇల్లు ఎంత శ్రమపడి పూర్తి చేసాడు?

ఒక రోజు

తాతయ్యా! ఇదిగో నీ జరీ కండువా త్వరగా రా- అని తొందర చేసే మనవడిని

నేను రాలేనులేరా రేపు నువ్వు కట్టుకున్నపుడు ఓపిక చేసుకుని వస్తానులేరా అంటే కృష్ణుడేమన్నాడు?

నా ఇల్లు అయితే ఒకటీ నా చెల్లెలదయితే ఒకటీనా! ఓపిక తెచ్చుకుని రావాల్సిందే అనలేదూ!

యీ వరండాకు గ్రిల్ పెడ్తే బాగుంటుందా ఇలా వదిలేస్తే బాగుంటుందా చెప్పు తాతయ్యా అని అడుగుతున్న మనవణ్ణి

నీ ఇల్లు కట్టుకున్నంత సంబరపడిపోతున్నావు గదరా అంటే ఏమన్నాడు?

నా అన్న కట్టిచ్చిన యిల్లిది అని అర్చన కళ్ళల్లో వున్న తృప్తి ముందు నా సంతోషం ఏపాటిది తాతయ్యా అనలేదూ! అలాటి కృష్ణుడు తన చెల్లెలు బావ ఆ కొత్త ఇంట్లో కాలు మోపుతున్నపుడు చూడలేకపోవడం వాడికి మాత్రం ఎంత అశాంతి?

ఆ అశాంతిని పట్టుదలను పోగొట్టాలనే ప్రయత్నంలో మనమడి చేయి పట్టుకుని అన్నాడు

ప్రశాంతంగా ఆలోచించు నీవు లేకుండా నీ చెల్లెలు గృహ ప్రవేశం ఎలా చేసుకుంటుంది

నువ్వే చెప్పు తాతయ్యా! రేవంత్ ఆ జానకిరామ్‌ని ఎలవడం తప్పు కాదూ! తాత చెయ్యి పట్టుకుని అడిగాడు మోహన్‌కృష్ణ

తప్పేనని చెప్తున్నాగా- అయినా నీకతనితో పనేంటి? నిన్ను ఆ జానకిరామ్ ఇంటికి వెళ్ళమని నేను చెప్పడం లేదుగా నువ్వెళ్ళేది నీ చెల్లెలింటికి అక్కడకు ఎవరొస్తే నీకెందుకు నీ స్థానం నీకెప్పుడూ వుంటుందిరా నిన్ను ఎలవనప్పుడు నువ్వు కించపడాలిగానీ

నన్ను ఎలవకపోయినా నేనింత బాధపడక పోదునేమో! ఏమైనా సరే నేను వెళ్ళలేను

చెల్లెల్నిచ్చమనే జ్ఞానమైనా లేదు నువ్వు కాఫీ త్రాగు నాన్నా చల్లారిపోతున్నాయి వాడితో ఎందుకు? క్రింద పెట్టిన కాఫీ గ్లాసు తండ్రి కందిస్తూ అంది కామాక్షి

వాడు వస్తా_డులేమ్మా నువ్వెళ్ళి తయారు కా పో

ఆమె వెళ్ళిపోయింది కళ్ళు తుడుచుకుంటూ కూతురు కన్నీరు ఆ వృద్ధుణ్ణి కలిచేసింది

తాతయ్యా! ఎవరి కోసం నేను ఆ జానకిరామ్‌కు పగయ్యాను నేనే తటస్థంగా ఆ రోజు వూర్కొనుంటే నేనతని చేతిలో అంత అవమానం పొందే వాణ్ణా? ఆ



జ్ఞానం రేవంత్‌కులేకపోయిందే! అమ్మ నాకు జ్ఞానం లేదంటుందేమిటీ! చిరాగ్గా ముఖం పెట్టి అడిగాడు.

* * *

పది నెలల తర్వాత కామాక్షి కళ్ళల్లో మరలా కన్నీరు. ఆమె కన్నీరు తుడవడానికి ప్రయత్నిస్తు_న్న

కోదండరామయ్య దగ్గరకు దురుసుగా వచ్చాడు మోహన్‌కృష్ణ

చూసావా తాతయ్యా! అర్చనను నా పెళ్ళికి పంపడట రేవంత్!

ఇలా జరుగుతుందని అనాడే నీకు చెప్పానుగా కృష్ణయ్యా

నా చెల్లెల్ని పంపడానికేం!

చిరునవ్వు నవ్వాడు కోదండరామయ్య

ఆ రోజు నువ్వు నీ చెల్లెలింటికెళ్ళడానికేం!

దానికీ దీనికీ ఏం పోటీ? ఇది నా చెల్లెలి పుట్టిల్లు

నీవా రోజు వెళ్ళడం మానేసింది నీ చెల్లెలి మెట్టింటికి అది మర్చిపోతే ఎలా?

ఎప్పుడు నువ్విలాగే మాట్లాడుతావులే తాతయ్యా! ఉక్రోషంగా అక్కడ నుండి వెళ్ళిపోయాడు కొత్త మామిడాకుల తోరణాలు దాటుకుని మోహన్‌కృష్ణ

ఆ కొత్త మామిడాకుల తోరణాలు వాసనలుతో పెళ్ళి మిఠాయి ఘుమ ఘుమలు ఆ ఇంటిని నింపిన దూరపు బంధువులతో మోహన్‌కృష్ణ పెళ్ళి రేపని తెల్పుతున్నాయి-కానీ ఆ ఇంటి అడబడుచు యిప్పటి వరకు రాలేదు వస్తుందన్న ఆశ లేని కామాక్షి గుండెల్లో రంపపు కోత

నే వెళ్ళి కాళ్ళు పట్టుకుని తీసుకొస్తాలేమ్మా నువ్వు దిగులు పడబాకు

కన్నీళ్ళుబికి వస్తున్న కళ్ళెత్తి దీనంగా తండ్రి కళ్ళల్లోకి చూచి తల దించుకుంది కామాక్షి భర్త సరే

# ఉదయం

గుండె కొలన్నుంచి
ఎగిస వచ్చే రక్తాక్షరాలు
పేదల బ్రతుకుల్లో
విద్యుత్తై ప్రసరిస్తే
ఆ కళ్ళల్లో
వెన్నెల పూస్తే
అదే
అసలు ఉదయం

– ముత్యాల ప్రసాద్

# ఉడుకురక్తం

కొడుకు కూతురు ఈ భూమ్మీద పడడం వరకే బాధ్యత తీసుకుని కన్ను మూసి చాలా కాలమే అయింది అక్క చెల్లెళ్ళు అన్నదమ్ముళ్ళు లేరు వున్న ఒకే ఒక కూతుర్ని అల్లుడు మొండికేసి పంపడం లేదు తండ్రి వుంటే కూతురి గురించి బాధ పడే వాడే కానీ ఆమెకేమి సహాయం చేయలేని అనారోగ్యపు వృద్ధుడు యీ శుభ కార్యానికి తన కూతురు అల్లుడు నట్టింట్లో కళ కళలాడూ తిరక్కుంటే ఎలా బాగుంటుంది నలుగురిలో వెలితి మాటలెలా వున్నా తన మనసుని నింపిన వెలితి ఎలా తీరుతుంది

వెళ్ళగలవా నాన్నా తన వెలితిని తండ్రి తీర్చగలడేమో అనే ఆశతో అంది

వెళ్తానులేమ్మా

మంగమ్మగారి అల్లుడ్ని తోడు తీసుకెళ్ళు

వద్దులేమ్మా ఇవన్నీ వాళ్ళకు తెలీదమెందుకు? అని కర్ర వూతతో బయలుదేరిన ఆ వృద్ధుడిలో ఒకటే ప్రశ్న

ప్రేమలుండీ ఎందుకీ అవేశాలు ఎందుకీ పట్టింపులు? వాని వల్ల ఎన్ని కన్నీళ్ళు ఎంత అశాంతి ఎంత అశాంతినైనా భరించడానికి సిద్ధపడుతున్నారేగానీ వాళ్ళ పట్టుదలలెందుకు వదులుకోరు!

*   *   *

రిక్షా దిగి మనమరాలి ఇంట్లో కాలు పెట్టాడు కోదండరామయ్య తాతగార్ని చూడగానే కన్నీళ్ళు పెట్టుకుంది అర్చన

మనమరాలి కన్నీళ్ళు అమె కట్టుకున్న సాదా చీర ఆ వృద్ధుడికి జవాబు చెప్పాయి అన్న పెళ్ళికి తను రావడంలేదని

మనవరాల్నడిగి ఏం లాభం? అయినా అడక్కుండా వుండలేకపోయాడు

మరీ ఇంత పట్టుదల మంచిది కాదమ్మా అర్చనా!

అర్చన తల వంచుకుంది అతనింకేమి మాట్లాడదల్చుకోలేదు వంచుకున్న మనమరాలి జవాబులో అర్థాలు అతనికి బోధపడ్డాయి

నా భర్తను అవమానిస్తే నన్నవమానించినట్టు కాదా! ఆయన కాదంటే నేనెలా రాను అది ఏమైనా కానీ అర్చన రావడం లేదు తన స్వంత అన్న పెళ్ళికి




కొన్ని ఏళ్ళుగా కలలుగన్న సోదరుడి శుభకార్యానికి ఆ పిల్ల రావడం లేదు జవాబు ఏదైనా వెనుక కారణం ఒక్కటే పట్టుదల

నేరుగా అల్లుడి గదిలోకి నడిచాడు ఆ రోజు ఆదివారం రేవంత్ ఇంట్లో వుంటాడని తెలుసు

అతను తాతగార్ని సాదరంగా ఆహ్వానించాడు టిఫిన్ ప్లేట్లతో బ్రూ కాఫీతో ఆతిథ్యమిచ్చాడు అత్తగారు బాగుందా అని కుశల ప్రశ్నలు వేసాడు కానీ పెళ్ళికి రానన్నాడు

అదేమిటి నాయనా! ఈసారికి వాడిని మన్నించరా వాడు నీ భార్యకు అన్నే కాదు నీకు స్నేహితుడు కూడా

ఆ విషయం మా గృహప్రవేశం రోజు వాడికి తెలియాలిగా తాతగారూ!

తెలియాలి పోనీ చెప్తే తెల్సుకోవాలి గొణిగాడు కోదండరామయ్య

వాడికోసం కాకపోయినా కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్న నా కూతురి కోసం దాని కూతుర్ని తీసుకురావయ్యా

కొద్దిగా కదిలాడతను

వచ్చే పనయితే అర్చనను తీసుకెళ్ళండి

ఉసూరుమని లేచి నిల్చున్నాడతను

రానులే తాతయ్యా ఆయన్ను కాదనీ అమ్మకు చెప్పు మరో రోజు వస్తానని

అలా అంటున్న మనమరాలి వంక దీర్ఘంగా చూసాడతను

ఏమి ఆడపిల్లలు! తల్లి కన్నీరు చూడగలరు కానీ భర్త మనసు బాధ పెట్టలేక ఈ పిల్లలు ఏడిస్తే కంది పోతారని ఏమి తల్లడిల్లిపోతుందా తల్లి

ఆఖరి ప్రయత్నంగా అన్నాడు

ఒక్కసారి వెళ్ళి అల్లుణ్ణి అడిగి రామ్మా నువ్వయినా ఒప్పించుకోకపోతే ఎలా?

ఆ రోజు అన్నయ్యను ఒప్పించుకోగలిగాను ఈ రోజు ఈయన్ని ఒప్పించుకోవడానికి అంతా మన ఎచ్చి తాతయ్యా! ఆ పిల్ల కళ్ళ నిండా నీళ్ళు

అంటే మరోసారి భర్తను అడగడానికి మనమరాలు ఇష్టపడ్డం లేదన్నమాట

కష్ట్రపూతతో కదిలాడు

ఒక్క నిముషం వుండు తాతయ్యా!

ఆ పిల్ల పరిగెత్తినట్టు లోపలికెళ్ళింది

ఆమె కళ్ళ తడిలో కదలాడిన ఆరాటం ఆ వృద్ధుడి చూపు పరిధిని దాటి పోలేదు

ఆప్యాయమైన అనుబంధాన్ని తృణీకరించేంత బలమైనవా ఈ పట్టుదలలు పంతాలు ఉరకలెత్తే ఉడుకు రక్తంలో పారేవి క్రోధాలు రోషాలే కాని ఆప్యాయతలు కావా? ఒక తల్లి ఒడిలో పెరిగిన అన్నా చెల్లెళ్ళ బంధాన్ని కూడా లెక్క చేయకుండా ఆ నాడు పట్టుదలలకు పోయిన కృష్ణుడు ఈనాడు పోనీలే అని సరిపెట్టుకోలేని రేవంత్ ఓ క్షణం వివేకంగా ఆలోచించి వుంటే ఈ రోజు ఇద్దర డవాళ్ళ కళ్ళల్లో కన్నీళ్ళు మిగిలేవి కాదు

వృద్ధాప్యపు ఆలోచనలనకు అంతరాయం కలిగిస్తూ గుప్పెట్లో వస్తువుని తన చేతిలో వుంచింది అర్చన

ఆ చిన్న పెట్టె తెరిచాడు ఒంటి వజ్రపుటుంగరం చాలా ఖరీదైన వస్తువు

వద్దులేమ్మా యింత డబ్బు పోసి కొన్నా ఈ రాయి వుంగరం ఎంత కాంతిగా వున్నా నీవు వాడి పెళ్ళికి రాకపోతే అది చీకటే అవుతుంది తల్లీ! నీ రాక ఇచ్చిన సంతోషం యింత డబ్బు పోసి కొన్న వస్తువులో కృష్ణుడికి దొరుకుతుందనుకోను

అతను తన భావాలను స్పష్టం చేయలేకపోయాడు డెబ్బై ఏళ్ళ అతని మనస్సు అతని పెదాల్ని వారించింది

ఆ పసి పిల్ల కనీస సంతోషాన్ని తనెందుకు దోచుకోవాలి?

అలాగేమ్మా ఇస్తాను మీ మనస్సు మారితే ఆఖరి క్షణంలో అయినా రండి

డెబ్బై సంవత్సరాల ఆ వృద్ధుడి జీవితంలో ఇలాంటి సంఘటనలు క్రొత్తేమీ కాదు ఇంతకంటే క్లిష్టతరమైనవి కూడా ఎదుర్కొన్నాడు కానీ అవివేకంతో అజ్ఞానంతో ఆవేశంతో మొండితనంతో పట్టుదలతో కక్షతో ఎందుకు జీవితాల్ని అర్థ రహితంగా మలుచుకుంటారో అర్థం కాని ఆ వృద్ధుడు ఏ రోజుకారోజు ఏ క్షణానికా క్షణం ఇలాటి సంఘటనలు తారసపడినప్పుడు ఆలోచిస్తూనే వుంటాడు ఆక్రోశిస్తూనే వుంటాడు బహుశా ఆ గుండె చలనం ఆగిపోయేదాకా అతని ఆలోచనలు అతని ఆరాటం ఆగిపోవేమో! □

# ఈ వేమన పద్యాలు




గురుతు తీరువల్ల కులమెల్ల చెడిపోయె
స్త్రీల నడత వల్ల సిగ్గు పోయె
చౌటినేల వల్ల జలమెల్ల చెడిపోయె
విశ్వదాభిరామ వినురవేమ